క్లుప్తంగా

నేడు గొడవర్రులో గడప గడపకు మన ప్రభుత్వం

కంకిపాడు: మండలంలోని గొడవర్రులో ఈనెల 14వ తేదీ నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉదయం 8 గంటలకు గ్రామంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు.

నేడు కంకిపాడు–3 సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్

మండల కేంద్రమైన కంకిపాడు–3 సచివాలయంలో ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సచివాలయం పరిధిలో నిర్వహించే కార్యక్రమం, జెండా ఆవిష్కరణ, గృహసందర్శనలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

‘మానవత’కు రూ.లక్ష విరాళం



హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖకు పారిశ్రామిక వేత్త బియ్యాపురెడ్డి ప్రసాదరెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. ఏలూరురోడ్డులో నిర్మిస్తున్న మానవత భవన నిర్మాణం నిమిత్తం రూ.1,01,116 విరాళాన్ని మానవత రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావుకు సోమవారం అందించారు. హైదరాబాద్‌లో స్థిర పడిన ప్రసాదరెడ్డి తన తండ్రి బియ్యాపురెడ్డి పెద్ద వెంగళరెడ్డి (సున్నపుబట్టి రెడ్డి) జ్ఞాపకార్థం విరాళాన్ని మానవతకు అందించారు. హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, కోశాధికారి పాబోలు గణేష్, సీనియర్ సభ్యులు వడ్డీ రాజేశ్వరరావు, జన్యావుల సత్యనారాయణ, పాట్లూరి శేషాచలం, గంటా ఇందిరాదేవి, వేగిరెడ్డి సూర్యానారాయణ పాల్గొన్నారు.

ప్రతి శనివారం డోకిపర్రుకు ఆర్టీసీ బస్ సర్వీస్

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ప్రతి శనివారం గుడ్లవల్లేరు మండలం డోకిపర్రుకు బస్ సర్వీస్ నడపనున్నట్లు డీఎం పి.శివాజీ సోమవారం తెలిపారు. డోకిపర్రులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం సర్వీసును ఏర్పాటు చేసినట్లు వివరించారు. గన్నవరం నుంచి దావాజీగూడెం, ఉంగుటూరు, కొయ్యగురపాడు, గుడివాడ మీదుగా డోకిపర్రు నడపనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి శనివారం ఉదయం 6 గంటలకు గన్నవరం నుంచి బస్సు బయలుదేరి 7.45కు డోకిపర్రు చేరుకుంటుందని, తిరిగి 11.30కు డోకిపర్రు నుంచి బయలుదేరి 1.15 గంటలకు గన్నవరం చేరుకుంటుందని వివరించారు.

రూ.కోటితో సౌండ్ బ్యారియర్స్

- కానూరు ఫ్లైఓవర్‌పై వేగంగా పనులు
- త్వరలో రోడ్డు నిర్మాణం
- లైటింగ్ ఏర్పాటు



కానూరు ఫ్లైఓవర్ మీద సౌండ్ బ్యారియర్స్ ఏర్పాటు చేసిన దృశ్యం

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద నిర్మాణంలో ఉన్న ఫ్లై ఓవర్ తుది దశ పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.కోటితో సౌండ్ బ్యారియర్స్ (శబ్దనివారణ) పనులు చేపట్టారు. కానూరులో పంటకాలువ పై గతంలో సనత్‌నగర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు రోడ్డు నిర్మించారు. అయితే పంటకాలువ కానూరు వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీ మధ్య నుంచి వందడుగుల రోడ్డు వరకు ఉంది. కాలేజీ మధ్యలో రోడ్డు నిర్మిస్తే విద్యార్థులకు అసౌకర్యం కలిగి సమస్య తలెత్తుతుందని కళాశాల యాజమాన్యం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం సహకారంతో ఫ్లై ఓవర్ తామే నిర్మాణం చేస్తామని కాలేజీ యాజమాన్యం సీఆర్‌డీఏతో ఎంవోయూ చేసుకుంది. ఇందులో భాగంగా ఫ్లై ఓవర్ నిర్మించినా ఇతర పనులు టీడీపీ పాలనలో జరగలేదు.

ఎమ్మెల్యే చొరవతో...

ఫ్లై ఓవర్ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ముందుకు వచ్చారు. ఆయన సీఆర్‌డీఏ, తాడిగడప మున్సిపాలిటీ అధికారులు, కాలేజీ యాజమాన్యాన్ని సమన్వయ పరిచారు. ఇందులో ముందుగా ఫ్లై ఓవర్‌పై సౌండ్ బ్యారియర్స్ నిర్మాణం చేపట్టారు. తాడిగడప మున్సిపాలిటీ రూ.50 లక్షలు, సీఆర్‌డీఏ రూ.50 లక్షలు కలిపి రూ కోటితో సౌండ్ బ్యారియర్స్ పనులు జరుగుతున్నాయి. వాహనాలు ఫ్లై ఓవర్ పై రాకపోకలు సాగించే సమయంలో శబ్ద నివారణకు ఈ చర్యలు చేపట్టారు. త్వరలో ఫ్లై ఓవర్‌పై తారు రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టనున్నారు.

మసీదు నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ



మసీదు పెద్దలకు చెక్కు అందజేస్తున్న పడమట స్నిగ్ధ

పెనమలూరు: రాష్ట్రంలోని ప్రతి ఒక్క సామాజిక వర్గానికి పెద్దన్నగా జగనన్న నిలుస్తున్నారని, ఆయా వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. కానూరు సనత్ నగర్–సిద్ధిక్ నగర్ ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న మక్కా మసీదు నిర్మాణ పనులకు రక్ష ఫౌండేషన్ తరఫున రూ.50 వేలు చెక్కు సోమవారం అందించారు. ఈ సందర్భంగా మసీదు పెద్దలు పడమట స్నిగ్ధను ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. తన తండ్రి వైఎస్సార్ ఆశయాలను పుణికి పుచ్చుకుని పాలన సాగిస్తున్నారన్నారు. ముస్లింల సంక్షేమానికి ఎక్కడా లోటు రాకుండా విధానాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రాధాన్యతా క్రమంలో సంక్షేమ ఫలాలను ఆయా వర్గాలకు చేరువ చేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దేశం యావత్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైపు చూస్తోందని తెలిపారు. ప్రతిపక్షాలు ఓర్వలేక, ప్రభుత్వంపై బురద చల్లుతున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఎంపీటీసీ అహ్మద్, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, నాయకులు వహాబ్, రియాజ్, రహీం, బాజానీ, హజీజ్, రెహమాన్, బాబు పాల్గొన్నారు.

పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తాడిగడప మున్సిపాలిటీ మేనేజర్ విజయలక్ష్మి అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్‌లో భాగంగా ఆదివారం తాడిగడప సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డును ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు మాట్లాడుతూ జగనన్న అధికారంలో ఉంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. చంద్రబాబు వస్తే పథకాలను రద్దు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు కటికల క్రిస్టోఫర్, పి.సాంబయ్య, జిన్నా, ఖాదర్‌బాషా, ముజీబ్, పి.బాబూరావు పాల్గొన్నారు.

కుమారుడు అదృశ్యం

పెనమలూరు: కుమారుడు కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదుపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్‌కు చెందిన కొక్కిలిగడ్డ వీరబాబు కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. అతని కుమారుడు రవీంద్ర కార్పెంటర్. ఈ నెల 2వ తేదీన రవీంద్ర మిత్రుడు జోగినాయుడితో బైక్ విషయమై గొడవ జరిగింది. రవీంద్ర ఎవరికీ చెప్పకుండా వెళ్లి పోయాడు. అతని కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల వెదికినా ఆచూకీ దొరకక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

పెనమలూరు వంతెన వద్ద వీధి వెలుగులు



వీధి దీపాలు ఏర్పాటు తర్వాత వెలుగులు

పెనమలూరు: పెనమలూరు ప్రధాన మార్గంలో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. పెనమలూరు సెంటర్ నుంచి వంతెన వరకు ఉన్న ప్రధాన రహదారి తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఉంది. పెనమలూరు పంచాయతీకి హద్దుగా ఉండటంతో ఎవరికి వారు వీధి దీపాలు ఇంత కాలం ఏర్పాటు చేయలేదు. దీంతో స్థానికులు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. పెనమలూరు వంతెన వద్ద వీధి దీపాలు లేక పోవడంతో రాత్రి వేళల్లో ఇబ్బందిగా ఉంటోందని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాలతో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ప్రకాశరావు వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పెనమలూరు వంతెన వద్ద వీధి దీపాలు లేక చీకట్లు

రెండు బైక్‌లు ఢీ.. వ్యక్తికి గాయాలు

పెనమలూరు: రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో వ్యక్తికి గాయాలుకావడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం గన్నవరానికి చెందిన తిరువీధి నాగేంద్రవరప్రసాద్ పోరంకిలోని ఫిషరీస్ శాఖలో డ్రైవర్. అతను బైక్‌పై ఇంటికి బయలుదేరి కానూరు 100 అడుగుల రోడ్డులోకి వచ్చినప్పుడు వెనుక నుంచి వచ్చిన మరో బైక్ అతన్ని ఢీ కొట్టింది. ఘటనలో నాగేంద్ర వరప్రాద్ గాయపడ్డాడు. రక్తస్రావం కావడంతో స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్సీ వర్గీకరణపై బీజేపీకి చిత్తశుద్ధి లేదు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళి

గన్నవరం: ఎస్సీ వర్గీకరణపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళి విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 11న మాదిగల విశ్వరూప మహాసభలో పాల్గొన్న ప్రధాని నరేంద్రమోదీ వర్గీకరణపై నిర్దిష్టమైన ప్రకటన చేయకపోవడం బాధకరమన్నారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని లేకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

స్వయం ఉపాధికి బడ్డీకొట్లు అందజేత



రామవరప్పాడు: రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, దాత యలమంచలి జయప్రకాష్ సుమారు 25 కూరగాయలు, ఇస్త్రీ బండ్లు, బడ్డీకొట్లను అందజేశారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో పలువురు పేదలను గుర్తించి సాయం అందించారు. జయప్రకాష్ మాట్లాడుతూ ఎనికేపాడులోని వైఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా పలు నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

తోట్లవల్లూరు: కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి జరిపి పలువురిని అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని ఐలూరు శివారు కనిగిరిలంకలో జరిగింది. గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై సోమవారం సాయంత్రం దాడి చేశామని ఎస్ఐ పి.విశ్వనాథ్ తెలిపారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.36,150 నగదు, రెండు కోడిపుంజులు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్ రాణి

కంకిపాడు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కంకిపాడు శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని వారం రోజులు పాటు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం, క్విజ్, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

గన్నవరం: స్థానిక పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారి డి. బాబురావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

గన్నవరం రూరల్: స్వాతంత్ర్య ఉద్యమానికి గ్రంథాలయ ఉద్యమం ఎంతో మేలు చేసిందని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. పురుషోత్తపట్నం శాఖాగ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఆమె లైబ్రేరియన్ కె.కృపానందంతో కలసి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 14నుంచి 20వ తేదీ వరకూ పెద్ద ఎత్తున ప్రభుత్వం వారోత్సవాలను నిర్వహిస్తోందని ప్రజలను విజ్ఞానవంతులను చేయడమే లక్ష్యమన్నారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో నేటి నుంచి కార్తిక అభిషేకాలు

పెనమలూరు: యనమలకుదురులో శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో కార్తిక మాస అభిషేకాలు నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు కార్తిక మాస పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆలయంలో 17వ తేదీ నాగుల చవితి, 20వ తేదీ మొదటి సోమవారం స్వామివారికి శాంతికల్యాణం, 26వ తేదీ కార్తిక పౌర్ణమి, 27వ తేదీ రెండో కార్తిక సోమవారం సందర్భంగా శాంతికల్యాణం చేస్తామని తెలిపారు. 30వ తేదీ స్వామివారి జన్మ నక్షత్రం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామివారికి కుంభాభిషేకం, అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకరణ, అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం ఉంటుందన్నారు. డిసెంబర్ 4వ తేదీ 3వ కార్తిక సోమవారం సందర్భంగా శాంతికల్యాణం, 8వ తేదీ స్వామివారికి బిల్వార్చన, 11వ తేదీ 4వ సోమవారం స్వామివారికి శాంతికల్యాణం, 13వ తేదీన ఉద్వాసన పూజలు ఉంటాయని వివరించారు. భక్తులు గోత్రనామాలతో అభిషేకం చేయించుకోవాలంటే ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

పెనమలూరు: పోరంకిలోని శ్రీఆంజనేయ భవాని శంకర సూర్యనారాయణస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని దేవాలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. నాగులచవితి, పౌర్ణమి, కార్తిక సోమవారాల సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని వివరించారు.

పేరంటాలమ్మ ఆలయంలో..

రామవరప్పాడు: రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో మంగళవారం నుంచి కార్తిక మాసం పూజలు ప్రారంభమవనున్నాయని ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ సోమవారం తెలిపారు. ఈనెల 14 నుంచి వచ్చె నెల 13 వరకు కార్తికమాసం సందర్భంగా పలు పూజా కార్యక్రమాలను ఆలయంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతోపాటు వచ్చే నెల 12న కార్తిక మాసం ఆఖరిరోజు సర్వేషాం అమావాస్య, 13న పోలి స్వర్గం కార్యక్రమాలను నిర్వహిస్తామని వివరించారు.

వాడవాడలా దీపావళి సందడి

కంకిపాడు: దీపావళి పర్వదినాన్ని మండలంలో ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు దీపావళి పర్వదినం ఉండటంతో పెద్ద, చిన్నా అందరూ ఉదయం వేళల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన సెంటర్లలో విక్రయించిన టపాసులు కొనుగోలు చేసి ఇళ్ల ముంగిట అందమైన రంగవల్లుల నడుమ టపాసుల పేల్చి ఆనందంగా గడిపారు. దీపాల కాంతుల్లో గ్రామాలు కొత్త శోభ సంతరించుకున్నాయి.

విజయవాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు దీపావళి వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ధన త్రయోదశి సందర్భంగా ఆలయాల్లో, ఇళ్లలో ధనలక్ష్మీదేవికి పూజలు చేసి సాయంత్రం దీపాలు వెలిగించారు. చెడుపై మంచి సాధించిన విజయాన్ని దృష్టిలో పెట్టుకుని చిన్న, పెద్ద తేడా లేకుండా గ్రామాల్లో అందరూ టపాసులను కాల్చారు. నున్నలో చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి దేవస్థానంలో పూజాకార్యక్రమాల అనంతరం సదానందస్వామి దీపోత్సవం ప్రారంభించిన పిమ్మట వేదపాఠశాలలోని విద్యార్థులు టపాసులను కాల్చారు. శ్రీవేణుగోపాల స్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాల్లో లక్ష్మీదేవి పూజలు చేశారు.

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో దీపావళి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం రాత్రి టపాసులు కాల్చి సంతోషం వ్యక్తం చేశారు.

సహకార బ్యాంకుల్లో సొమ్ముకు భద్రత



జాత నిర్వహిస్తున్న కళాకారులు

గుడివాడ టౌన్(నందివాడ): పొదుపు సొమ్ముకు సహకార బ్యాంకులు భద్రత కల్పిస్తాయని జనార్ధనపురం సహకార బ్యాంక్ అధ్యక్షుడు కొండపల్లి లక్ష్మీ నాగేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. నందివాడ మండలం జనార్ధనపురం గ్రామంలో సోమవారం సహకార బ్యాంకుల పనితీరు, లాభాలు, ఇతర అంశాలపై ఏర్పాటు చేసిన జాతాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ ఆదేశాల మేరకు ప్రజలకు సహకార బ్యాంకుల ప్రాధాన్యతను జాతా ద్వారా వివరిస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా, సురక్ష యోజన బీమా, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులు, నగదు రహిత లావాదేవీలు, ఏటీఎం సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని వినియోగించుకుంటూ గ్రామీణ ప్రజలు సహకార బ్యాంకుల్లో సొమ్ము భద్రపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సెక్రటరి విరివాడ అంజిబాబు, బ్యాంక్ ఉద్యోగులు, కళాజాత సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాగాయకుడు జైరాజ్



మొక్క నాటుతున్న జైరాజ్

చల్లపల్లి: మనిషి సౌకర్యవంతంగా, విలాసవంతంగా జీవించడానికి అవసరమైన ప్రతీది అందిస్తున్న ఈ ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణకు చెందిన ప్రముఖ ప్రకృతి కవి, ప్రజా గాయకుడు జైరాజ్ అన్నారు. స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం 9వ వార్షికోత్సవాన్ని సోమవారం ఉదయం స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్కే ప్రసాద్ – డాక్టర్ తరిగోపుల పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన జైరాజ్ మాట్లాడుతూ ఈ ప్రకృతికి తానేమి చేయాలని భావించానో అవన్నీ చేస్తున్న గొప్ప వ్యక్తులను చల్లపల్లి గ్రామంలో చూసే అదృష్టం దక్కిందన్నారు. తొమ్మిదేళ్లుగా స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి స్వచ్ఛ కార్యకర్త గర్వకారణమైన స్థాయిలో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా జైరాజ్ ఆలపించిన ప్రకృతి గేయాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్(నానీ), పర్యావరణ వేత్త ఉదయ్ సింగ్ గౌతమ్, ప్రముఖులు ముప్పాళ్ల భార్గవశ్రీ, దాసరి రామ్మోహనరావు, పంచాయతీ ఈవో మాధవేంద్రరావు, స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు, పద్మావతి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా వేడుకలను పురస్కరించుకుని గ్రామంలో పాదయాత్ర, మొక్కలు నాటే కార్యక్రమం, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు.

అంకమ్మ శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమావాస్య పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా కుంకుమ పూజలు అభిషేకాలు, శ్రీ చక్రార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ కార్యదర్శి దాట్ల శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు పర్యవేక్షించారు.

వెయ్యి మందికి అన్నదానం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ప్రజలను ఆదుకోవడంలోనే అసలైన సంతృప్తి దాగిఉందని, ప్రతి ఒక్కరూ తమకు ఉన్నదాంట్లో లేనివారికి సాయం చేయాలని కళ్ళే లలితా చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతామహాలక్ష్మి, జయదుర్గ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభాగ్యులకు, నిస్సహాయులకు సేవ చేయడం ఆ భగవంతుడికి సేవ చేయడంతో సమానమని, ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా పేద ప్రజలకు అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. అనంతరం వెయ్యి మందికి అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో ముప్పూరి హరీష్, ఎం.జశ్విన్, జి.ధృవన్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కాళికామాతకు ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లి శక్తిగుడిలో కాళికా అమ్మవారికి ఆదివారం అమావాస్య ఘడియల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీపావళి అమావాస్య సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి అభిషేకాలు చేశారు. ప్రతి సంవత్సరం దీపావళి అమావాస్య రోజున అభిషేకాలు, పూజలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారికి పూలతో విశేష అలంకారాలు చేసి పూజలు చేశారు. నగరంలోనే కాక పరిసర ప్రాంతాల భక్తులు ఆలయానికి విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు బాబీ, ఐవోబీ శ్రీనివాస్ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.